క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు తీవ్ర గాయాలు

కొమ్మాది : భీమిలి బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. గాజువాక సమీప కూర్మన్నపాలెంకు చెందిన కురుష్ (28), హృషిప్ (21) ఆదివారం మధ్యాహ్నం తమ ద్విచక్ర వాహనంపై భీమిలి వైపు వస్తున్నారు. బైకు అతి వేగంగా నడుపుకుంటూ రావడంతో సాగర్‌నగర్ అంధుల బాలికల పాఠశాల సమీపంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ క్రమంలో ఒకరి ముఖంపై, మరొకరి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రోడ్డంతా రక్తపు మడుగుతో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. వాస్తవానికి వీరు బైక్‌పై విన్యాసాలు చేస్తూ ప్రయాణించారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆరిలోవ ఎస్‌ఐ శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. అయితే ప్రస్తుతం వీరికి ప్రాణాపాయం లేదని ఆయన తెలిపారు.

మెడాల్ డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభం



మధురవాడలో డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభిస్తున్న అహ్మద్, తదితరులు

మధురవాడ : మధురవాడ దోబీఖానా సమీపంలో మెడల్ డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఆదివారం హజరత్ ముక్తియార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎండీ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 900 రకాలు పరీక్షలు చేసే మెడాల్ డయాగ్నస్టిక్ ఫ్రాంచైజీ అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పలువురికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. నిర్వాహకులు తన్నీరు వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకురాలు వట్టికుల నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

పీఎం పాలెం : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన పవిత్ర నృత్యాలయంలో శిక్షణ పొందిన చిన్నారి కళాకారులు తమ నృత్య విన్యాసాలతో ప్రేక్షకులను అబ్బురపరిచారు. భవ్యశ్రీ,, చైత్రి, సహస్ర, శాంభవి, త్రిషిక యశస్వి, భవిష్య, హవ్యసాయి, హంసిని, పూజిత, కీర్తన తదితర కళాకారులు నృత్యం చేయగా ఎం.పవిత్ర నృత్య దర్శకత్వం వహించారు.

సీఎం జగనే మరోమారు ముఖ్యమంత్రి



ఆలయం వెలుపల కొబ్బరికాయలు కొడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



షిర్డీ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తగరపువలస : ఈ నెల 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయం సాధించి మరోమారు ముఖ్యమంత్రి కావడం ఖాయమని వైఎస్సార్‌సీపీ రెండో వార్డు నాయకులు అన్నారు. అలాగే భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మి విజయం సాధించడం ఖాయమన్నారు. స్థానిక మెయిన్ రోడ్డులోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం 100 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎంతో అభివృద్ధి చేసి చూపించారన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధే వైఎస్సార్‌సీపీకి మరోమారు పట్టం కట్టేలా ప్రజలు ఓట్లు వేశారన్నారు. జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశాఖలో ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి, నాయకులు చిల్ల సూర్యనారాయణరెడ్డి, నమ్మి మాధవ, వంశీరెడ్డి, చిల్ల ప్రమీల, నీలాతి రాము, జగన్నాథ ఎల్లాజీ, చేట్ల నరసింగరావు, గేదెల సన్యాసప్పడు, కంచుబోయిన వెంకటరావు, జీరు పద్మ, చేట్ల అప్పలసూరమ్మ, బోర రామారావు, తోణంగి ఎల్లాజీ, కర్రి బుజ్జి, పీతల రాజారావు, శీరపు నర్సింగ్, బోర గోవింద్, ఉప్పాడ అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీదే విజయం

తగరపువలస : ఈ నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపులో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవుతారని రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డు అప్పలనాయుడు అన్నారు. ఆదివారం సింహాచలంలో సింహాద్రి అప్పన్న దర్శనం అనంతరం వారు మాట్లాడారు. రాష్ట్రంలో పేదలు, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిన సీఎం జగన్ విశాఖలో ప్రమాణ స్వీకారం చేసేందుకు అనువైన వాతావరణం కల్పించాలని కోరామన్నారు. అధికంగా ఎగ్జిట్ పోల్స్ కూడా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నందున విజయోత్సవాలు చేసుకునేందుకు రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు.



సింహాచలంలో నాగవంశ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అప్పలకొండమ్మ, అప్పలనాయుడు

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర పూజ చేస్తున్న అర్చకుడు



నిత్య కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనని వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళం



సూపరింటెండెంట్ వెంకటరమణకు చెక్కు అందజేస్తున్న నండూరి రామకృష్ణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన నండూరి రామకృష్ణ స్వామి అనే దాత రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. ఆదివారం స్వామివారి దర్శనానికి వచ్చిన ఆయన సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణకు అందించారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి నృత్య శిక్షణ శిబిరం



శిబిరంలో నృత్యం నేర్చుకున్న చిన్నారులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ రెవెన్యూ పార్కులో నెల రోజుల పాటు జరిగిన వేసవి నృత్య శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. చందన డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో అకాడమీ నృత్యకారులు సుమారు 100 మంది చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా చిన్నారులు తమ నృత్య ప్రదర్శనతో తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, అకాడమీ నిర్వాహకులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి



దీక్షశిబిరంలో మస్తానప్ప, పిట్టారెడ్డి

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు, వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పిట్టా రెడ్డి కోరారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహించిన 1207వ రోజు దీక్ష శిబిరంలో వారు మాట్లాడారు. సెయిల్‌లో విలీనం చేయడంతో పాటు సొంత గనులు కేటాయించడం ద్వారా విశాఖ ఉక్కు పూర్వ వైభవానికి సహకరించాలన్నారు. తెలుగు ప్రజల సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం అంత సులభమైన విషయం కాదని గ్రహిస్తే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్నేటి రమణ, నంది తాతారావు, భీమారావు, కటికల కల్పన, ఎస్.చంద్రశేఖర్, కె.ప్రభాకర్, పిట్టా సంజీవ్ రెడ్డి, గెద్దాడ అప్పలకొండ, పి.శంకరరావు, పి.నీలకంఠం, హరనాథ్, ఎం.వి.రమణ పాల్గొన్నారు.

జర్నలిస్ట్ దుర్గారావు సేవలు చిరస్మరణీయం

సీతంపేట: జర్నలిస్ట్ సంఘాల నాయకుడిగా, సీనియర్ పాత్రికేయుడిగా సోడిశెట్టి దుర్గారావు అందించిన సేవలు చిరస్మరణీయమని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం మైదానంలో ఆదివారం దుర్గారావు రెండో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. శ్రీధర్‌తోపాటు పలువురు జర్నలిస్టులు దుర్గారావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గారావు జర్నలిస్ట్‌గా అందరి మనసుల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ దుర్గారావు మరణించి రెండేళ్లు కావస్తున్నా.. నేటికీ అందరి మనసుల్లో నిలిచి ఉన్నారన్నారు. అనంతరం లెన్స్ హన్స్ సంస్థ సహకారంతో కంటి వైద్య శిబిరం నిర్వహించి కంటి డ్రాప్స్, ఉచితంగా మందులు, 50 శాతం రాయితీతో కళ్లద్దాలు అందజేశారు. వర్షం కారణంగా క్రికెట్ మ్యాచ్ వాయిదా వేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు వాల్మీకి నాగరాజు, లోకేష్‌కుమార్, గుండురాజు, దుర్గారావు కుమారులు నిఖిల్, లోహిత్ పాల్గొన్నారు.



దుర్గారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జియ్యాని శ్రీధర్, గంట్ల శ్రీనుబాబు తదితరులు

జీతాల కోసం 'ఉక్కు' ఉద్యోగుల ఎదురుచూపులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో నెలాఖరుకు జీతాలు చెల్లించేవారు. గత కొన్ని నెలలుగా జీతాలు ఎప్పుడు చెల్లిస్తారో అని ఉద్యోగులు ఎదురు చూడాల్సి వస్తోంది. గత నెలలో 21, 24 తేదీల్లో రెండు భాగాలుగా జీతాలు చెల్లించారు. అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు సీఎండీని కలిసి జీతాల చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై ప్రశ్నించినా ప్రయోజనం లేకపోయింది. ప్రస్తుతం మార్కెటింగ్ బాగున్నా జీతాల చెల్లింపుపై జాప్యం జరగడం పట్ల ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈనెలలో పిల్లల జీతాల చెల్లింపులు వంటి అదనపు ఖర్చులు ఉన్నందున జీతాలు ఎప్పుడిస్తారా అని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.

ఉత్సాహంగా పర్యావరణ సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డైరెక్టర్ బాగ్చీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం పర్యావరణ సైకిల్ ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్టీల్‌ప్లాంట్ పర్యావరణ, స్పోర్ట్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్‌ర్యాలీని ఉక్కునగరం త్రిష్టా మైదానంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె. బాగ్చీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం స్టీల్‌ప్లాంట్ అనేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. లక్షలాది మొక్కలు నాటడం ద్వారా కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సైకిల్ ర్యాలీ ఉక్కునగరంలోని పలు సెక్టార్ల మీదుగా తిరిగి త్రిష్టా మైదానానికి చేరుకుంది.

బాలబాలికలు పర్యావరణ ఆవశ్యకతను తెలియజేసే ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల వలయంలో ఏయూ ప్రాంగణం



పార్కింగ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పోలీసులు

ఏయూ క్యాంపస్: పోలీసుల వలయంలోకి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల వెళ్లింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రక్రియ మొత్తం ఇక్కడే జరుగుతోంది. మరికొద్ది గంటల్లో ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఒకవైపు ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు.. మరో వైపు భద్రతాపరంగా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాలల ప్రాంగణంలోకి వచ్చే ప్రతి వ్యక్తిని గుర్తింపు కార్డులు తనిఖీ చేసి లోపలికి పంపుతున్నారు. అదే విధంగా మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపునకు అవసరమైన విధంగా మైదానాలలో పార్కింగ్‌కు సంబంధించిన గుర్తులు వేసే పనిని పోలీసులు దగ్గరుండి చేపట్టారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ప్రాంగణం మొత్తం పోలీసుల నిఘాలో ఉండనుంది.

నిషేధిత వస్తువులు దొరికితే చర్యలు



వెల్లంకిలో వలస కూలీలను ప్రశ్నిస్తున్న ఆనందపురం పోలీసులు

తగరపువలస : నిషేధిత వస్తువులు ఎవరి ఇళ్లలో అయినా గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవని ఆనందపురం సీఐ టీవీ తిరుపతిరావు హెచ్చరించారు. సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 4న జరగనున్న సందర్భంగా ముందస్తు చర్యల్లో భాగంగా ఆదివారం సిబ్బంది సాయంతో బొడ్డపాలెం, వెల్లంకి గ్రామాల్లో ప్రతీ ఇంటినీ, ఇంటిలో నివసిస్తున్న వారి ఆధార్‌కార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వలస కూలీలతో మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మారణాయుధాలు, బాణసంచా నిల్వ చేసేందుకు ఎవరూ ఇళ్లను అద్దెకు ఇవ్వకూడదని సూచించారు. అలాంటి సంఘటనలు ఎదురైతే నిషేధిత వస్తువులు నిల్వ చేసిన వారితోపాటు ఇల్లు అద్దెకు ఇచ్చిన వ్యక్తిపై కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తుల సమాచారం పోలీస్‌లకు తెలియజేయాలని స్థానికులను కోరారు. తనిఖీల్లో ఎస్‌ఐ గంటా సంతోష్, ఏఎస్‌ఐ సత్యనారాయణ, పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



ఆటో ద్వారా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న భీమిలి పోలీసులు

తగరపువలస : ఈ నెల 4న సాధారణ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ప్రజలంతా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా భీమిలి పోలీసులకు సహకరించాలని సీఐ డి.రమేష్ కోరారు. ఆదివారం ఆటోల ద్వారా భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని అర్బన్, రూరల్ గ్రామాల్లో ఆయన ప్రచారం చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మంగళవారం 144 సెక్షన్ అమలులో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలు జరపడానికి, బాణసంచా వెలిగించడానికి అనుమతులు లేవన్నారు. బహిరంగ మద్యపానం చేయడం, సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించారు. కౌంటింగ్ ముగిసే వరకు ప్రజలంతా శాంతియుతంగా పోలీస్‌లకు సహకరించాలని కోరారు.

నవ్వులు పంచిన వినోదాల విందు



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు సుబ్రహ్మణ్యం, ప్రకాష్

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ స్కిట్ల కార్యక్రమం నవ్వులు పంచింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు కళాకారులు స్కిట్లు ప్రదర్శించారు. సినిమా షూటింగ్, దోమ తెర, ఎస్‌ఐ గారికి ఫోన్, మినిస్టర్ మర్యాద, నెక్లెస్, ఇంద్రధనస్సు చీర, పేపర్ బాయ్, జాతకాలు, వాడితో మాట్లాడకు స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, భానుప్రకాష్, శివజ్యోతి, ఇమంది ఈశ్వరరావు, నాయుడు, పోర్టు శేషు, మల్లిక, నాగగణేష్ అద్భుత హాస్యం, హావభావాలతో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. ముందుగా నాట్య గురువు ఎస్.శైలజ శిష్య బృందం అక్షిత, నికేతని, ఐశ్వర్య, మంజుల చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో అతిథులు దాడి సత్యనారాయణ, నండూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, మాల్యాద్రి, సూర్య, పూర్ణచంద్రరావు కళాకారులను సత్కరించి అభినందించారు.

దైవ నామ సంకీర్తనతో ఆధ్యాత్మిక చైతన్యం



గీతాలు ఆలపిస్తున్న ఆధ్యాత్మికవేత్తలు

దాబాగార్డెన్స్ : నామ సంకీర్తనతో ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ తెలిపారు. నగరంలో గల కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆదివారం నామ సంకీర్తన, భక్తి గీతాలాపన, ఆధ్యాత్మిక ఉత్సవం నిర్వహించారు. ముందుగా మందిరంలో వేంచేసిన కుసుమ హరనాథ దివ్య మంగళ మూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కె. నాగేశ్వరరావు, ఎంవీ రాజశేఖర్, కోల్‌కతా ప్రసాద్ భక్తి గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భూమిపై నివశిస్తున్న జీవునికి నామ సంకీర్తనతోనే ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందన్నారు. భగవన్నామ సంకీర్తనలు చేస్తూ మానవ జన్మను సార్థకం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ సంయుక్త కార్యదర్శి కె. మంగరాజు, శివ, సీతారాం, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మెలోడీ క్రియేటర్స్ వార్షికోత్సవం



సినీ సంగీత విభావరిలో పాల్గొన్న గాయనీ గాయకులు, అతిథులు

దాబాగార్డెన్స్ : మెలోడి క్రియేటర్స్ 24వ వార్షికోత్సవం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, ప్రముఖ సంఘ సేవకుడు వంకాయల సన్యాసిరాజు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 23 ఏళ్లుగా సినీ సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తూ విశాఖ వాసుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న సాంస్కృతిక సంస్థ మెలోడీ క్రియేటర్స్ అన్నారు. ప్రేక్షకుల ఆదరణ పొందే దిశగా ఎన్నో సంగీత కార్యక్రమాలు న్విహించిన నిర్వాహకులను అభినందించారు. నటుడిగా ఎన్‌టీఆర్, గాయకుడిగా బాలసుబ్రహ్మణ్యం తెలుగు చలన చిత్ర పరిశ్రమకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పి. వెంకట్రావు, రమేష్‌చంద్ జైన్, కొణతాల రాజు, ఉషా చీరాల, ఎం. మస్తాన్‌రెడ్డి, మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి ఎంపీ రాజశేఖర్, ప్రోగ్రామ్ కన్వీనర్ కె. వీరాస్వామి, వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన



విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పిస్తున్న రీసోర్స్ పర్సన్ అరుణ

దాబాగార్డెన్స్ : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించారు. రీసోర్స్ పర్సన్ అరుణ విద్యార్థులకు కంప్యూటర్‌పై టైపింగ్ నేర్పించారు. అనంతరం విద్యార్థులు ఆటలు, పాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం పుస్తకాలు చదివారు. విద్యార్థులకు శీతల పానీయాలు, బిస్కెట్లు, చాక్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎల్ఆర్ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.